# వైభవంగా నందీశ్వరునికి ప్రదోషకాల అభిషేకం



**పెద్దాపురం, పెన్ పవర్, ఏప్రిల్ 16 :** పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమ్రోగింది. చైత్ర బహుళ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నందీశ్వరునికి అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా ప్రదోషకాల విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ?సూర్యాస్తమయ సమయాన, అత్యంత పవిత్రమైన ప్రదోష వేళలో వేదపండితులు బ్రహ్మశ్రీ ఆరాధ్యుల చిరంజీవిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగింది. వేద మంత్రోచ్చారణల నడుమ నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీర, దధి, ఘృత, మధు, శర్కరాది పంచామృతాలతో పాటు, గంధం, పన్నీరు వంటి సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేక కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నందీశ్వరుని నానావిధ పుష్పమాలికలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించి, కర్పూర నీరాజనాలతో పంచహారతులు ఇచ్చారు. ?పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ దివ్య ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## పెన్ పవర్
### కాకినాడ
### డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పారదర్శకంగా ఇసుకను పంపిణీ చేయాలి



- ఇసుక అక్రమాలు జరిపితే చర్యలు
- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 16:** భవన నిర్మాణ రంగానికి ఎటువంటి అసౌకర్యం కల గకుండా పారదర్శకమైన విధానంలో డిమాండ్ మేరకు ఇసుకను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత శాఖలను దేశించారు. గురువారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కమిటీ సభ్యు లతో చైర్మన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రుతుపవనాల సీజన్ వర్షాకాలంలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులు భవన నిర్మాణరంగ అవసరాలకు నిల్వలు చేయాలని ఆదేశించారు. జొన్నాడ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద 1.5 లక్షలు మెట్రిక్ టన్నులు, కపిలేశ్వ రపురంలో 1 లక్ష మెట్రిక్ టన్నులు, రావులపాడు వద్ద నాలుగు లక్షలు, ఆలమూరు నందు రెండు లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు ఉంచాలన్నారు. ఐదు మాన్యువల్ ఇసుక రీచులకు టెండర్లు ఖరారుకు గుత్తేదారులు రానందున వాటిని సెమీ మేకనైజ్డ్ రీచ్యువల్ గా మార్చి టెండర్లు పిలవాలన్నారు పట్టా భూములలో ఇసుక త్రవ్వకాలు సంబంధించి పనులను వేగవంతం చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్ టీములు నియమించి వారంలో కనీసం ఒకసారి తనిఖీ చేసేందుకై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ప్రజలు కూడా అక్రమ రవాణా గురించి సమాచారం అందించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు.? జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ డిమాండుకు అనుగుణంగా ఇసుక పారదర్శకంగా సరఫరా కావాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లాలో ఇసుక లభ్యత, సరఫరా మరియు అక్రమ రవాణా నిరోధానికి తీసుకో వాల్సిన చర్యలపై కమిటీ సభ్యులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకు న్నారు.?నిరంతర పర్య వేక్షణ లో భాగంగా జిల్లా లోని అన్ని ఇసుక రీచ్‌లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తవ్వకాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశిం చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిం దన్నారు. ప్రభుత్వం నిర్ణ యించిన ధరలకే వినియో గదారులకు ఇసుక అందే లా చూడాలని, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.?అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలపై నిఘా ఉంచేందుకు జిల్లా సరిహద్దుల్లోనూ, ప్రధాన రహదారుల్లోనూ చెక్ పోస్టులను బలోపేతం చేయాలని పోలీసు మరియు రెవెన్యూ శాఖలకు సూచించారు.

?వర్షాకాలం దృష్ట్యా ఇసుక కొరత రాకుండా ముంద స్తుగా స్టాక్ పాయింట్లలో తగినంత నిల్వలు ఉంచేం దుకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా అనుమతు లు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవ స్థను అనుసంధానం చేయాలని నిర్ణయించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జి మమ్మీ పి భాగ్యవతి, డిటిఓ డి శ్రీనివాసరావు భూగర్భ గనుల శాఖ ఏడి బి అశోక్ కుమార్ జల వనరుల శాఖ డి ఈ సుబ్బారావు, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము, డిపిఓ శాంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి క్షేత్రానికి భక్తుల రద్దీ... చందన స్వరూపుడి దర్శనానికి వేలాది తరలివచ్చిన భక్తులు





- నిత్య అన్నదానానికి భక్తులు విరాళం
- స్వామి వారి సన్నిధి లోఇంటెలిజెన్స్ డీఎస్పీ పి. ఈశ్వరుడు కుటుంబ సభ్యులు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 16:** కోనసీమలోని తిరుమల వాడపల్లి క్షేత్రం భక్తజన సందోహంతో కళకళలాడుతోంది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి చందన స్వరూపుడిగా విరాజిల్లుతున్న స్వామివారిని భక్తిశ్రద్ధలతోదర్శించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణం నిండా భక్తుల రద్దీ నెలకొని ఆధ్యాత్మిక వాతావరణం పరుచుకుంది. గురువారం సందర్భంగా స్వామివారి ఆలయ సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ పూజలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. దర్శనానికి వచ్చిన భక్తులు స్వామివారి కృపకటాక్షం పొందేందుకు క్యూలైన్లలో వేచి దర్శనం పొందారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన కరణం చిన్నబాబు, భవ్య దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,107 విరాళంగా సమర్పించారు. వారి సేవాభావాన్ని ఆలయ అధికారులు అభినందించారు.

అదేవిధంగా, కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రాన్ని సందర్శించిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ పి. ఈశ్వరుడు కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి, ప్రసాదాలు సమర్పించారు.

# జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శుల సమావేశం

- అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరిన చైర్మన్ లు



**అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 16:** కోనసీమ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల 2026-27 సంవత్సరంలో వార్షిక బడ్జెట్ ప్రతిపాదన పై జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శులతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ ( విశాఖపట్నం) పి సుధాకర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మార్కెటింగ్ పి పాపారావు లు సమీక్ష సమావేశం నిర్వహించారు. అంబాజీపేట మార్కెట్ యార్డ్ నందు నిర్వహించారు. ఈ సమావేశములో వ్యవసాయ మార్కెట్ కమిటీ అంబాజీపేట చైర్మన్ శ్రీ చిట్టూరి శ్రీనివాస్, నగరం ఏ. చైర్మన్ అమలాపురం ఏ.ఎం సి చైర్మన్, ముమ్మిడివరం ఏఎం సి చైర్మన్ రాజోలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కొత్తపేట ఏఎంసీ చైర్మన్ పల్లి మంగాదేవి హాజరైనారు. ఈ సమావేశంలో చైర్మన్లు యొక్క సూచనల మేరకు బడ్జెట్ నందు వారి ప్రతిపాదనను ఆమోదిస్తూ సదరు ప్రతిపాదనను మార్కెటింగ్ శాఖ కమిషనర్ వారి అనుమతి కొరకు పంపగలరు అని జెడియం తెలియజేసారు. జిల్లాలోని మార్కెట్ కమిటీల చైర్మన్లు మార్కెట్ కమిటీల వారీగా అభివృద్ధి పనులకు చేసిన ప్రతిపాదనలపై ఇందులో చర్చించారు. మార్కెట్ కమిటీలకు నిధులు కేటాయింపు చెయ్యాలని ఈ సందర్భంగా చైర్మన్లు కోరారు. ఈ కార్యక్రమంలో డీడియం విజయవాడ, డాట్మో అమలాపురం, కార్యదర్శి, అంబాజీపేట ఏఎంసి కార్యదర్శి ఐ రమేష్ తో పాటు జిల్లాలోని మార్కెట్ కమిటీలు కార్యదర్శులు ఉద్యోగులు పాల్గొన్నారు

# భద్రత ఏది?

- పొంచి ఉన్న ప్రమాదం
- కానరాని జాతీయ రహదారి భద్రత
- పేరుకే భద్రతావరోత్సవాలు నిర్వహణ
- అయోమయంలో వాహన చోదకులు



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,16:** రహదారి విస్తరణలో భాగంగా 16వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ చేసినప్పటికీ పూర్తి భద్రత కరువైందని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణలో భాగంగా రహదారి విస్తరించినప్పటికీ ప్రమాదాల నివారణ కరువైందని పలువురు వాహన చోధకులు వాపోతున్నారు. ఓ పక్క వాహనాలు రాకపోకలతో ప్రమాదాలు జరుగుతుంటే మరో ప్రక్క రోడ్డు భద్రత నివారణపై కానరాని చర్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలోని ముఖ్య కూడలిలో ఏర్పాటుచేసిన డివైడర్ల వద్ద రోడ్డు ప్రమాదాల జరుగుతుండగా ఉండేందుకు మరోపక్క రహదారికి ఇరువైపులా తీసిన డ్రైనేజీలకు పూర్తి భద్రత కరువై ప్రమాదాలను బారిన పడే అవకాశం ఉందని వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లబుచ్చుకుంటున్నారు . గండేపల్లి మండలం జెడ్, రాగం పేట పంచాయతీ పరిధిలో 16వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వందలాదిమంది రోగులు ప్రతిరోజు వస్తూ వెళుతూ ఉంటారు. అయితే జాతీయ రహదారికి ఆనుకుని ఆసుపత్రికి తిరిగే క్రమంలో డ్రైనేజీకి భద్రత కరువై ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీకి పెద్ద గొయ్యి ఉన్న జాతీయ రహదారి అధికారులు నిర్లక్ష్య వైఖరి వహిస్తూ మాకు సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.. రోగులను తీసుకువచ్చే వారు రోగులు కన్నా ముందు డ్రైనేజీలో పడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకొని ఆసుపత్రిలో ఉండవలసి వస్తుందేమోనని పలువురు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా గ్రామాలలోని డివైడర్లు వాహన శోధకులకు , మాట చారులకు మార్గమధ్యలో పోవుటకు వీలు లేకుండా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేసినప్పటికీ అవసరాలకు అనుగుణంగా ఎవరు ఇస్తా రాజ్యంగా వారు సేఫ్టీ గ్రిల్స్ ను తొలగిస్తున్న జాతీయ రహదారి అధికారులు తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే గాని అధికారులు పట్టించుకోరా? ప్రాణాలు కోల్పోతే గాని కళ్ళు తెరవరా ? అన్న ప్రశ్నలు పలువురు నోటా వినబడుతున్నాయి. పేరుకే రహదారి భద్రత వారోత్సవాలను అధికారులు నిర్వహించి తమ పని అయిపోయినట్లు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాలు జాతీయ రహదారి అధికంగా సుమారు 15 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారి ఉండటంతో సరైన భద్రత లేక ప్రమాదాలకు కూడా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రహదారి విస్తరణ ఉన్నత అధికారులు చర్యలు తీసుకుని వాహన చోదకులకు, బాటచారులు కు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.


# కాకినాడలో కిశోరి వికాసంపై ప్రాంతీయ వర్క్‌షాప్





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 16:** కిశోరి బాలికల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ప్రాంతీయ వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి. హెచ్. లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో బాలికల సాధికారిత, భద్రత, విద్య, నైపుణ్యాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. మహిళా భివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి వర్చువల్‌గా పాల్గొని కీలక సూచనలు చేశారు. కిశోరి వికాసం వేసవి సమావేశాలు మే 1 నుండి జూన్ 10 వరకు నిర్వహించబడతాయని, కౌమార బాలబాలికలకు అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి డా.టి. తిప్పేనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కౌమార దశలో సరైన మార్గదర్శకత్వం, ఆరోగ్య పరిరక్షణ, విద్య, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ దశలో సమగ్ర అభివృద్ధి సాధిస్తే భవిష్యత్తులో వారు ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారని తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ సి. హెచ్. లక్ష్మి మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమ లక్ష్యాలు,మార్గదర్శకాలను వివరించారు. గ్రామ, వార్డు స్థాయిలో 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలకు ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్య ప్రాముఖ్యత, లైంగిక మరియు ప్రజనన ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ నర్సింహమూర్తి, యూనిసెఫ్ ప్రతినిధి మేరీ జాన్స్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ కిశోరి గ్రూపుల ప్రాముఖ్యతను వివరించారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఈ కార్యక్రమాలు కీలకమని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కాకినాడ, తూర్పుగోదావరి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ,పోలవరం జిల్లాలకు చెందిన మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమశాఖ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు,మిషన్ కో-ఆర్డినేటర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.


## ర్యాలి గ్రామ దేవత వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 16:** ర్యాలి గ్రామంలో ఉన్న గ్రామదేవత శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం ఈ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడనున్నది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, నైవేద్యాలు ఘనంగా జరుగనున్నట్లు ఆలయ వర్గాలు తెలియజేశాయి. భక్తులు అమ్మవారికి చలివిడి, వడపప్పు, పానకం వంటి నైవేద్యాలను సమర్పించి తమ కోరికలను వ్యక్తపరచుకుంటారు. అమ్మవారి అనుగ్రహంతో భక్తుల మనోరథాలు నెరవేరుతాయని స్థానికులలో గాఢమైన విశ్వాసం నెలకొంది. ఈ తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి. వెంకటరమణమూర్తి మరియు ఆలయ చైర్మన్ నామాల శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి, ఆమె కృపాకటాక్షాలను పొందాలని ఆలయ చైర్మన్ ధర్మకర్తల మండలి విజ్ఞప్తి చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244

## రైతులకు రూ.17.80 లక్షల రుణాల పంపిణీ



**కాజులూరు పెన్ పవర్ ఏప్రిల్ 16:** తణుకువాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు "రైతు నేస్తం" పథకం కింద రూ.17.80 లక్షల రుణాలను బట్వాడా చేశారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ పితాని సతీష్ కుమార్ మాట్లాడుతూ రైతులందరికీ పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు తదితర సహాయాలు సకాలంలో అందజేస్తామని తెలిపారు. భూమి గల కొత్త రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.రాబోయే పంట కాలానికి అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ సహకారంతో సమయానికి అందజేస్తామని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, వందశాతం వసూళ్లకు సహకరించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి మేనేజర్ శ్రీ గొల్లపల్లి ఫకీర్ రావు, సూపర్వైజర్ శ్రీ ఎమ్.ఎస్. విజయభాస్కర్,సీఈఓ మరియు రైతులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం ఎస్ ఐ ఆర్ కన్వీనర్‌గా సలాది శేఖర్ నియామకం

- హర్షం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు



**రామచంద్రపురం పెన్ పవర్, ఏప్రిల్ 16:** దేశవ్యాప్తంగా పారదర్శకమైన ఓటరు జాబితాల రూపకల్పన లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రారంభించిన రెండో విడత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గానికి సలాది శేఖర్‌ను కన్వీనర్‌గా భారతీయ జనతా పార్టీ నియమించింది.ఈ నియామకంపై బీజేపీ కాజులూరు మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ, మండల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సలాది శేఖర్ నాయకత్వంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ విజయవంతంగా సాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఓటరు జాబితాల స్వచ్ఛీకరణలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని,పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని నేతలు తెలిపారు.

## 17న కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 16:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 3వ శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.జిల్లా అధికారులు మధ్యాహ్నం 3:45 గంటలకే కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

### రావులపాలెంలో శ్రీ చైతన్యలో అకాడమిక్ ఎక్సెలెన్స్ ప్రోగ్రాం ప్రారంభం

విద్యార్థుల ఉన్నతికి నూతన కార్యక్రమం




**రావులపాలెం, పెన్ పవర్ ఏప్రిల్ 16:**రావులపాలెంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో అకాడమిక్ ఎక్సెలెన్స్ ప్రోగ్రాంను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ ఇన్‌చార్జ్ ఎం.వి.ఎల్ నరేష్ హాజరై ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా అకాడమిక్ ఎక్సెలెన్స్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన నరేష్, విద్యార్థుల ఉన్నతిని దృష్టిలో ఉంచుకుని శ్రీ చైతన్య విద్యాసంస్థలు పలు మార్పులు చేపడుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఈ అకాడమిక్ ఎక్సెలెన్స్ ప్రోగ్రాంను ప్రవేశపెట్టినట్లు వివరించారు.ఈ ప్రోగ్రాం విధి విధానాలను అకాడమిక్ కోఆర్డినేటర్లు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లే విధంగా ఈ కార్యక్రమం రూపొందించబడిందని తెలిపారు.

స్కూల్ ప్రిన్సిపాల్ జగదీశ్ మాట్లాడుతూ, ఈ ఏడాది నుండి 3, 4, 5 తరగతి విద్యార్థులకు మాత్రమే కొన్ని ఎంపిక చేసిన శ్రీ చైతన్య బ్రాంచుల్లో ఈ ప్రోగ్రాం అమలు చేస్తున్నారని చెప్పారు. ఆ ఎంపిక చేసిన బ్రాంచుల్లో రావులపాలెం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ డీన్ నాగేంద్ర, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ మూర్తి, ప్రైమరీ ఇన్‌చార్జ్ బేబీ కుమారి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ రాజేశ్వరి తదితరఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ర్యాలి గ్రామంలో అంగన్వాడి అవగాహన కార్యక్రమం





### పిల్లల అభివృద్ధిపై తల్లిదండ్రులకు కీలక సూచనలు

**ఆత్రేయపురం, పెన్ పవర్ ఏప్రిల్ 16:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని త్రిమూర్ నగర్‌లో గురువారం అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పిల్లల తల్లిదండ్రులకు పలు ముఖ్య సూచనలు అందిస్తూ, చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో కుటుంబం పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, శారీరక--మానసిక వికాసంపై అవగాహన కల్పించడం లక్ష్యమని వివరించారు. తల్లిదండ్రులు పిల్లల ఆహారపు అలవాట్లు, శుభ్రత, రోజువారీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ప్రస్తుత కాలంలో చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలు వంటి డిజిటల్ స్క్రీన్‌లకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, ఇది వారి మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల పిల్లలలో ఏకాగ్రత లోపం, కంటి సమస్యలు, సామాజిక అనుబంధం తగ్గడం వంటి సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అందువల్ల పిల్లలను స్క్రీన్‌లకు దూరంగా ఉంచి, ఆటలు, కథలు, చిత్రలేఖనం, సంగీతం వంటి సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలని సూచించారు. ఈ విధమైన కార్యకలాపాలు పిల్లలలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు.చిన్న వయస్సులోనే అంగన్వాడి పాఠశాలలో చేరడం ద్వారా పిల్లల మెదడు అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో అందించే ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు పిల్లల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయని వివరించారు.

పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు సరైన నిర్ణయాలు తీసుకుని, అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడి పిల్లల తల్లిదండ్రులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## స్వీయ గణనతో సమగ్ర సమాచారం



మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్,ఏప్రిల్ 16:** భారతదేశ జనాభా గణన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తన స్వగృహంలో స్వీయ గణన (సెల్ఫ్ ఎంయుమరేషన్) పోర్టల్ ద్వారా గురువారం కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ప్రభుత్వం అందిస్తున్న స్వీయ గణన విధానాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను స్వీయ గణన పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా సమగ్ర, ఖచ్చితమైన జనాభా గణనకు సహకరించవచ్చని తెలిపారు.జనాభా గణన దేశ అభివృద్ధికి కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల సరైన అమలుకు ఇది ముఖ్య పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.అలాగే జనాభా గణన సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలని, అవసరమైన సమాచారం సమయానికి అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనగణన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సంస్కర్త వీరేశలింగం ఆదర్శాలు నేటితరం అందిపుచ్చుకోవాలి



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16;**సామాజిక సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు ఆదర్శాలను విద్యార్థులు పుణికిపుచ్చుకోవాలని, పాఠ్య పుస్తకాలతోపాటు, మంచి పుస్తకాలు సైతం చదివి విజ్ఞానవంతులు కావాలని ఆలమూరు మండల విద్యాశాఖాధికారి శ్రీ భమిడిపాటి అప్పాజీ పిలుపునిచ్చారు. బాలమందిరం ఆధ్వర్యంలో సంధిపూడి జెడ్.పి.హైస్కూల్ లో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు.ముందుగా కందుకూరి చిత్రపటానికి మండల విద్యాశాఖాధికారులు భమిడిపాటి అప్పాజీ, ఎన్ రాజు , అతిథులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ వేడుకలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వి.వి.ఎస్.ఎన్.మూర్తి అధ్యక్షత వహించారు. కందుకూరి సమాజానికి చేసిన సేవలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. అనంతరం సంధిపూడి హైస్కూల్ విద్యార్థుల రచనలతో బాల మందిరం ప్రచురించిన చిట్టి ఊహలు బాలల పత్రికను ఆవిష్కరించారు. 13 సంవత్సరాలలోపు విద్యార్థులు సెల్ ఫోన్ ను వినియోగించడం కంటే పుస్తక పఠనం పై దృష్టి సారించాలని ఎంఈవో లు భమిడిపాటి అప్పాజీ, నేదునూరి రాజు ఈ సందర్భంగా కోరారు. డైట్ లెక్చరర్, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ కె.కృష్ణ సాయి మాట్లాడుతూ విద్యార్థులు కందుకూరి వీరేశలింగం పంతులును ఆదర్శంగా తీసుకుని శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. సైన్స్ అంశాలతో కూడిన ఆయన ప్రసంగం విద్యార్థులను అలరించింది. బాలసాహిత్య రచయిత్రి శ్రీపాద సీతామహాలక్ష్మి పేరమాంబ, ఖండవల్లి వేంకటేశ్వర స్వామి, బాల మందిరం వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణాచార్యులు, ఉపాధ్యాయులు ఎన్.ప్రసూన, మాధవి తదితరులు సమావేశంలో మాట్లాడుతూ చిట్టి ఊహలు పత్రిక ద్వారా కొత్తతరం రచయితలు తీర్చిదిద్దబడతారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## బెదిరింపులతో బెంబేలెత్తుతున్న బులియ్య రేవుప్రజలు....... ఇల్లు కట్టాలంటే భయమే!





- నిర్మాణాలు ఆగిపోతున్నాయని బాధితుల వాదన
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధం

**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 16:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ శివారు బులియ్య రేవు ప్రాంతంలో ఇల్లు నిర్మాణాలు చేపడుతున్న ప్రజలు ఓ వ్యక్తి బెదిరింపులతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఈ ప్రాంతంలో లేఔట్ కాలనీలు వేగంగా అభివృద్ధి చెందుతూ, అనేక మంది తమ సొంత ఇల్లు నిర్మించుకోవాలని ముందుకు వస్తున్నారు. అయితే, ఈ అభివృద్ధికి అడ్డంకిగా ఒక వ్యక్తి వ్యవహరిస్తున్నాడని కోటూరి లక్ష్మి ఆరోపిస్తున్నారు.బాధితుల వివరాల ప్రకారం, బృందావన సుధాకర్ అనే వ్యక్తి "మీకు ఇల్లు కట్టే హక్కు లేదు... నాకు పోలీసులతో పరిచయం ఉంది" అంటూ నిర్మాణాలు చేపడుతున్న వారిని బహిరంగంగా బెదిరిస్తున్నాడు. అతని మాటలు వినకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాడని వారు చెబుతున్నారు. ఈ బెదిరింపుల కారణంగా అక్కడి కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతూ, తమ ఇళ్ల నిర్మాణాలను కొనసాగించాలా వద్దా అన్న సందిగ్ధంలో పడిపోయాయి.కొత్తగా ఇల్లు నిర్మించుకోవాలని భావిస్తున్న వారు కూడా ఈ పరిస్థితిని గమనించి వెనక్కి తగ్గుతున్నారని సమాచారం. దీంతో ఆ ప్రాంతంలోని లేఔట్ కాలనీల అభివృద్ధి నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కుటుంబాలు ఇప్పటికే పనులను నిలిపివేసినట్లు కూడా తెలుస్తోంది.ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. తమకు రక్షణ కల్పిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చట్ట పరంగా హక్కులు ఉన్నప్పటికీ, ఇలాంటి బెదిరింపులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడటం బాధాకరమని వారు అంటున్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల భద్రత, హక్కుల పరిరక్షణలో పోలీసులు ఎంత వేగంగా చర్యలు తీసుకుంటారన్నదే కీలకంగా మారింది.

## వైద్యాధికారిగా సుదీప్తి



**ఆలమూరు, పెన్ పవర్, ఏప్రిల్ 16;**ఆలమూరు మండలంలో నున్న పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా ఎం.సుదీప్తి నియమితులయ్యారు. పుట్టపర్తి మెడికల్ కాలేజీలో డి ఆర్థో అండ్ డీఎన్బీ ఆర్థో విభాగంలో డిగ్రీ కోర్సు లను ఆమె పూర్తి చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్త వైద్యుల నియామకంలో భాగంగా ప్రభుత్వం సుదీప్తిని స్థానిక వైద్యాధికారిగా నియమించింది. దీంతో ఆస్పత్రికి ఇద్దరు వైద్యుల భర్తీ జరిగి నట్లయ్యింది.

# తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే గిడ్డీ సత్యనారాయణ



అంబాజీపేట, పెన్ పవర్ ఏప్రిల్ 16:ప్రజా సమస్యలను తన దృష్టి కి వచ్చిన మరుక్షణం సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం గా ప్రజా పాలన అందిస్తున్న ఎమ్మెల్యే కు ప్రజలు నీరాజనాలు... డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135 వ జయంతి కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు ఇరుసుమండ గ్రామ పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోట గ్రామానికి మంగళవారం రాత్రి వెళ్లిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఆ కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గురించి మొరపెట్టుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే అక్కడే తక్షణం నిర్ణయం తీసుకున్నారు. కాలనీవాసులను పిలిచి హ్యాండ్ పైపు బుధవారం సాయంత్రానికల్లా వేయించాలని, దానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలను తక్షణమే పాటిస్తూ సుమారు రూ.10 వేలు విలువైన చేతిపంపును వేయించి. ఆయన బుధవారం రాత్రి హ్యాండ్ పైపును ప్రారంభించి తాగునీటి సమస్యను పరిష్కరించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను ఒక్కరోజులోనే పరిష్కరించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోమంది ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదని, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తక్షణ చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే గ్రామంలో ఉన్న ఇరువురు దివ్యాంగులకు అధికారులతో మాట్లాడి రెండు బ్యాటరీ మోటార్ సైకిల్ లను మంజూరు చేయించారు. వేసవి సెలవులను వినియోగించేందుకు విద్యార్థులకు క్రికెట్ కిట్ ను అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కోట హనుమంతరావు, కోట వెంకటేశ్వరరావు, బూచి వరప్రసాద్, చిల్లి గోపాలకృష్ణ, నాగాబత్తుల సత్యనారాయణ, రమేష్, చిల్లి సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జనగణన పై సమావేశం






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 16:** జనాభా లెక్కలు 2027 ని అనుసరించి ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన నకు సంబందించి ఈ నెల 15 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు స్వీయ గణన జరుగు చున్నందున అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని వివిధ ప్రజా ప్రతినిధుల చే స్వీయ గణన చేయించుట జరిగినది. మండల పరిషత్ అధ్యక్షులు చలగళ్ళ పద్మనాభుడు ( దొరబాబు ) చే మరియు జడ్పిటిసి సభ్యులు పరిమి వెంకట లక్ష్మి మంగతాయారు చే మరియు ఇతర గ్రామాల ఎంపీటీసీ సభ్యుల చే స్వీయ గణన కార్యక్రమము నిర్వహించడ మైనది. ఈ కార్యక్రమము నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి . కె. హరి కృష్ణ సత్య రెడ్డి , మండల పరిషత్ పరిపాలనాధికారి కర్రి చంద్ర రావు పాల్గొన్నారు.

# విద్యా బాల మందిర్‌లో కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు ఘనంగా




**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 16:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేటలోని విద్యా బాల మందిర్ హైస్కూలులో ప్రముఖ సామాజిక సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు నూట డబ్బై ఎనిమిదవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు (1849--1919) ఆంధ్రదేశంలో సంఘసంస్కరణలకు నాంది పలికిన మహనీయుడని,తెలుగు సాహిత్యంలో నవయుగ వైతాళికుడిగా నిలిచారని అన్నారు.రాజమండ్రిలో జన్మించిన ఆయన స్త్రీ విద్యా ప్రోత్సాహం, వితంతు పునర్వివాహాల కోసం జీవితాంతం పోరాడారని వివరించారు.తెలుగులో తొలి నవల'రాజశేఖర చరిత్ర' రచించి సాహిత్య రంగంలో విశిష్ట స్థానం సంపాదించారని పేర్కొన్నారు.బ్రహ్మ సమాజ భావాలతో మూఢనమ్మకాలు,సామాజిక దురాచారాలను తీవ్రంగా వ్యతిరేకించి,ఆంధ్రులలో పునరుజ్జీవనానికి బాటలు వేసిన మహానుభావుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం,ఉపాధ్యాయులు సుధాకర్,శ్యామల,కృష్ణ, అనీలతో పాటు విద్యార్థులు పాల్గొని వీరేశలింగం పంతులకు నివాళులర్పించారు.

# రాష్ట్ర రహదారిగా రావులపాలెం-బొబ్బర్లంక






- రూ 74.2 కోట్లతో
- లొల్ల లాకు ఆధునీకరణ
- రహదారి విస్తరణ పనుల కు నిధులు కేటాయింపులు
- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఏప్రిల్ 16:**ఆత్రేయపురం మండలం లొల్లలాకులు కాలువలు మూసివేత క్లోజర్ సమయంలో మరమ్మతు ఆధునీకరణ, రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ 74.2 కోట్లు కేటాయించిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం ఈ మేరకు రెవెన్యూ రవాణా జలవనరుల శాఖలతో స్థానిక కలెక్టరేట్లో సమావేశం నిర్వహించి లొల్ల లాకులు బొబ్బర్లంక -రావులపాలెం 12.5 మీటర్ల వెడల్పుతో రాష్ట్ర రహదారి విస్తరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. షట్టర్లు లాకులు వద్ద మరమ్మత్తు ఆధునీ కరణ పనుల ప్రతి పాదన లపై అధికారులతో సమీక్షించారు. ఈనెల 2వ తేదీన పనులకు గాను పరిపాలన అనుమతి లభించింద న్నారు. లాకులు డిజైను డ్రాయింగు పనులకు సంబంధించి ప్రతిపాద నలు సీ ఈ ఆధ్వర్యంలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనేషన్స్ కు పంపడం జరిగిందన్నారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర దేవస్థానం భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రహదారిగా రావుల పాలెం-బొబ్బర్లంక రహదారిని తీర్చిదిద్దడం జరుగుతుందని అదేవి ధంగా ఎక్కువగా ఇసుక రీచులు ఈ రహదారి వెంబడి ఉన్న నేపథ్యంలో సుమారు 32 టన్నుల బరువు గల ఇసుక తరలింపు వాహనాలు సంచ రించే విధంగా డిజైన్ రూపొం దిస్తున్నట్లు ఆయన తెలిపారు. 12.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణకు ప్రతిపాదించామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క రహదారికి మరింత పటిష్టత చేకూరే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ముందుగా జల వనరుల శాఖ ఇంజనీర్లు రూపొందించిన డిజైన్లను ఆయన నిశితంగా పరిశీలించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. డిజైన్ అనుమతులు వచ్చిన తరువాత మరొకసారి చర్చించి పనులకు టెండర్లను పిలవడం జరుగుతుందన్నా రు. రాష్ట్ర రహదారిగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణం మరింత నాణ్యత ప్రమాణాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఈ ఈ కే వెంకటేశ్వరరావు, జేఈ ప్రసన్న మాధవ్, డి టి వో డి శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు

# ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇంజనీర్ నవుతా...



**అంబాజీపేట, పెన పవర్, ఏప్రిల్ 15:** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి అంబాజీపేటకే ఆదర్శంగా నిలిచిన విద్యార్థి. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అంబాజీపేటకి చెందిన పెదమల్లు సంపత్ కుమార్ ఎం.పి.సి విభాగంలో 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించి అంబాజీపేటకే ఆదర్శంగా నిలిచాడు. తాను భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ) విభాగంలో ఇంజనీర్ అవ్వాలన్నదే లక్ష్యమన్నాడు. తన తల్లిదండ్రులు సుబ్బారావు, సురేఖలతో పాటు తన అక్క సంతోషి సలహా సూచనలు, తాను చదివిన అమలాపురం నారాయణా కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించానని తెలిపాడు. విద్యార్థిసంపత్ కుమార్ ను పలువురు అభినందించారు.

# జలధార - జల హారతి (100 రోజుల ప్రణాళిక) సమీక్ష సమావేశం



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 16:** గండేపల్లి మండల పరిషత్ కార్యాలయము నందు మండల పరిషత్ అభివృద్ధి వారి అధ్యక్ష్యతన జలధార -- జల హారతి లో భాగంగా 100 రోజుల ప్రణాళిక కి సంబందించి మండల పరిషత్ కార్యాలయము నందు ఉపాది హామీ సిబ్బంది , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు జల వనరుల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశము ఏర్పాటుచేయటం జరిగినది. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ. కర్రి సత్య హరి కృష్ణ రెడ్డి , ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ. సుబ్రమణ్యం , మండల పరిషత్ పరిపాలనాధికారి శ్రీ. కర్రి చంద్ర రావు , ఏపీవో . ఎమ్ రామకృష్ణం రాజు , ఈసీ పి. రమేశ్ మరియు ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 18 ఏప్రిల్ లోపు జలధార -- జల హారతి పనులు గుర్తింపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం సిబ్బంది, మరియు జల వనరుల శాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో కార్తీక్ శ్రీ సూర్య ప్రతిభ -- 470కి 465 మార్కులు




**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 16:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామ శివారు వాకాడ వారి పాలెం గ్రామానికి చెందిన వాకాడ కార్తీక్ శ్రీ సూర్య ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచాడు. మొత్తం 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు.సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాకాడ బాబులు, సత్యవతి దంపతుల కుమారుడైన కార్తీక్,తన కృషి,పట్టుదలతో ఈ విజయాన్ని సాధించాడు.ఆయన 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్థానిక కాంతి భారతి కాన్వెంట్‌లో విద్యను అభ్యసించి,ప్రస్తుతం విజయవాడలోని శ్రీ చైతన్య మయూరి భవనం జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.ఈ సందర్భంగా కార్తీక్ సాధించిన విజయంపై అతని పూర్వ విద్యాసంస్థ కాంతి భారతి యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్‌తో పాటు మెయిన్స్‌లో కూడా మంచి ర్యాంక్ సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపాడు.

